క్లుప్తంగా

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ల నిర్వహణకు అనుమతి



మాట్లాడుతున్న డాక్టర్ విక్రమసింహారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బాలాజి హాస్పిటల్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్లు సీనియర్ యురాలజిస్టు డాక్టర్ విక్రమసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను తనతో పాటు నెఫ్రాలజిస్టు డాక్టర్ కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ప్రైవేటు రంగంలో ఈ ఆపరేషన్ చేసేందుకు అనుమతి మొదటిసారిగా బాలాజి హాస్పిటల్‌కే వచ్చిందన్నారు. ఇటీవల కాలంలో కిడ్నీ సమస్యలు అధికమై చాలా మంది డయాలసిస్ చేయించుకుంటున్నారని, అందులో కొందరికి తప్పని పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాల్సి వస్తుందన్నారు. కిడ్నీ బాధితునికి రక్తసంబంధీకులైన భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెలు ఇచ్చిన కిడ్నీతో మార్పిడి ఆపరేషన్ చేస్తామన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలి

కల్లూరు: రైతుల పంట పొలాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రకత్వ గ్రామానికి చెందిన దళిత రైతుల పొలాలను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శితో పాటు సమాచార హక్కు చట్టం నాయకులు జయన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ తదితరులు పరిశీలించారు. రైతుల అనుమతి లేకుండా తక్కువ నష్టపరిహారం చెల్లించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం తగదన్నారు.

వలసలు నివారించాలి

కర్నూలు(సెంట్రల్) : వేసవి మొదలు కానుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించాలన్నారు. ఈనెల 24వ తేదీన అధికారుల తీరునకు నిరసనగా మండల కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ, వీరశేఖర్ పాల్గొన్నారు.

కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉద్యోగుల అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు



వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో

కర్నూలు(సెంట్రల్) : ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల స్పందనను డీఆర్వో అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏదైనా కారణంతో పరిష్కారం చేయలేకపోతే అందుకు తగిన కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు.

స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

● పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ హరి ప్రసాద్ ● లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లను సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆర్‌డీఓ హరిప్రసాద్ చెప్పారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ ఆఫీస ర్ కార్యాలయంలో పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్లు కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రామ్ ఆఫీసర్లు తనిఖీలు చేసి వారి పత్రాలు అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదా చూసి రిపోర్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆమోదం కోసం పంపించాలన్నారు. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. గర్భస్థ లింగ నిర్ధారణ గురించి ఎవ్వరికీ మాటల రూపంలో, చేతల రూపంలో, సైగల రూపంలో చెప్పరాదన్నారు. స్కానింగ్‌కు వచ్చినప్పుడు వారికి లింగ ఎంపిక, నిర్ధారణ గురించి చెప్పకూడదని, అలా చెబితే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషా, గైనకాలజిస్టు డాక్టర్ నర్మద, డెమో ప్రమీలాదేవి, ఏపీపీ సుబ్బయ్య, శ్రీనివాసులు, ఎన్‌జీఓ రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, పీసీ పీఎన్‌డీటీ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

● నగరంలో ఈనెల 28 వరకు ఇంటింటి సర్వే
● 136 సచివాలయాల పరిధిలో 1100 మంది ఉద్యోగుల నియామకం
● సామాజిక కులగణన సర్వేకు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం సామాజిక కులగణన సర్వేకు శ్రీకారం చుట్టింది.ఈ సర్వే ద్వారా ప్రతి ఒక్క కుటుంబం సామాజిక ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరించనుంది. దేశంలో 1931వ సంవత్సరంలో కులగణన సర్వే చేపట్టారు. అప్పటి నుంచి ఏ రాష్ట్రంలో కూడా కులగణన సర్వేలు చేపట్టలేదు. మొట్టమొదటి సారిగా ఏపీ సర్కారు అన్ని కులాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే చేపడుతుంది. ఈ నెల 20 వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో ఈకార్యక్రమం జరుగనుంది. ఇందుకోసం 1100 మంది సచివాలయాల ఉద్యోగులను ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు నియమించారు. వీరి పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు 11 మంది సూపర్‌వైజర్లను, ప్రతి సూపర్‌వైజర్‌కు ఇద్దరు అసిస్టెంట్లను నియమించారు. 10 రోజుల పాటు నగరంలోని 136 సచివాలయాల పరిధిలోని 1.19 లక్షల కుటుంబాల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారు.

సర్వేకు సహకరించండి



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో ఈనెల 28 వ తేదీ వరకు సామాజిక ఆర్థిక కులగణన సర్వే చేస్తున్నాము. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఆదాయం, ఆర్థిక స్థితిగతులు గురించి సేకరిస్తారు. ఇందుకు ప్రజలు సహకరించాలి. కొత్తగా వచ్చిన వారి వివరాలు, వారి ఆర్థిక పరిస్థితులు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఇప్పటికే ప్రభుత్వం నవరత్నాల పేరుతో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తుంది. – రామలింగేశ్వర్, ఇన్‌చార్జ్ కమిషనర్

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): అసంఘటిత కార్మికులు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నగరంలోని మార్కెట్ యార్డులో అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు ఈ–శ్రమ్, పీఎంఎస్‌వైఎం కార్డును చేయించుకుంటే ఎంతో లబ్ధి పొందవచ్చునన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ మాట్లాడుతూ ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా మెరుగైన ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సి.సాంబశివ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు ఈ–శ్రమ్ కార్డు తీసుకోవాలన్నారు. వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయవాది పి.నిర్మల మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన పథకాల గురించి వివరించారు.

రాజ్యాధికారంలో వాటా సాధిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): కలిసికట్టుగా పోరాడి రాజ్యాధికారంలో వాటా సాధించుకుందామని బీసీ నేతలు అన్నారు. ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు చేపట్టిన బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్ర శుక్రవారం ఇక్కడకు చేరుకుంది. ఈ సందర్భంగా బీసీ నేతలు అంబేడ్కర్ భవన్ నుంచి బీసీ భవన్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి, బీసీ భవన్‌లో సభ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలన్నారు. గ్రామాలు, మండలాల్లో బీసీలు రాజకీయ చైతన్యం పెంచుకోవాలన్నారు. ఇందుకు గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్‌లు, లైన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతుండటం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కర్నూలు అర్బన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చక్రపాణి, ఏడీఈ రాజేంద్ర బాబు తెలిపారు. సెంట్రల్ సెక్షన్ (విజయ పాల డెయిరీ, 3వ పట్టణ పోలీస్ స్టేషన్, చాణక్యపురి కాలనీ, జొహరాపురం రోడ్డు తదితర ప్రాంతాలు) , బి.రోడ్ సెక్షన్ (తులసీ నగర్, వెంగల్‌రావు నగర్, అమీలియా హాస్పిటల్ బ్యాక్‌సైడ్, ఇల్లూరు నగర్ కూరగాయల రైతు మార్కెట్ ఏరియా), పవర్‌హౌస్ సెక్షన్, సంతోష్ నగర్ సెక్షన్, క్యాంపస్ సెక్షన్ డి 2 సబ్ డివిజన్, ఓల్డ్ టౌన్ సెక్షన్ ఐఎస్ డీ2 సబ్ డివిజన్, ఎస్టేటు సెక్షన్ ఐస్ డీ2 సబ్ డివిజన్ పరిధిల్లోని కాలనీలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఎస్టేటు సెక్షన్ సబ్ డివిజన్ పరిధిలోకి ముజఫర్‌నగర్, కాటసాని ఉమామహేశ్వరి నగర్, శరీన్ నగర్, రాఘవేంద్రనగర్, ఆదిత్యనగర్,ఐటీసీ సర్కిల్ ప్రాంతాలు కూడా వస్తాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం లోపు 2 నుంచి 4 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మార్కెట్ ధరకు కందులు కొనుగోలు

కల్లూరు: మార్కెట్ ధర ప్రకారమే రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తామని జిల్లా సివిల్ సప్లై అధికారి (డీఎస్‌ఓ) ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మీపురం, నాయకల్లు గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడుతూ కందులు విక్రయించాలనుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ/వీహెచ్ఏలను సంప్రదించాలన్నారు. కందుల విక్రయం అనంతరం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఉచితంగా గోనె సంచులు సరఫరా చేయడంతో పాటు లేబర్ చార్జీల భారం, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కందులను పప్పుగా మార్చి కార్డు దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీతో అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'అల్లూరి సత్యనారాయణ రాజు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' నవల హిందీ అనువాదం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పూర్వ శాసన మండలి సభ్యులు ఎం.వి.వి.ఎస్.శర్మ, అల్లూరి సత్యనారాయణరాజు సోదరులు ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

22న అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ సంబరాలు

● కర్నూలు పురవీధుల్లో రాముల వారి విగ్రహంతో శోభాయాత్ర
● ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నమూనా అయోధ్య రామాలయం, శ్రీరాముని పట్టాభిషేకోత్సవం



మాట్లాడుతున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు క్రిష్టన్న

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన కర్నూలులో అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె.క్రిష్టన్న పేర్కొన్నారు. శుక్రవారం సీ క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేడుకల వివరాలు వెల్లడించారు. అయోధ్య కేసును వాదించేందుకు అయ్యే వ్యయాన్ని జిల్లాకు చెందిన ప్రముఖ నేతి మిఠాయిల దుకాణం నిర్వాహకుడు జి.పుల్లారెడ్డి సమకూర్చిన నేపథ్యంలో ఈ ఉత్సవాలను ఆయనకు అంకితం చేస్తున్నామన్నారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సీతారాముల వారి కల్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అక్కడి నుంచే శ్రీరాముల వారి విగ్రహంతో శోభయాత్ర ప్రారంభమై నగరంలోని పురవీధుల గుండా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంటుందన్నారు. మైదానంలో నమూనా అయోధ్య రామాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 5.30 గంటలకు విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతులు శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిచే ధార్మిక ప్రవచనం, ఉపన్యాసాలు, 7.30 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు. రామాయణంలోని ఘట్టాలను వివరించే పోస్టర్ల ప్రదర్శన ఉంటుందన్నారు. హిందూ బంధువులు అందరూ ఉత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. టీటీడీ పురాణ పండితులు పౌరాణిక శిరోమణి వి.రామకృష్ణ శేషసాయి వక్తగా, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, కార్యదర్శి నటేష్ కుమార్, ఉపాధ్యక్షులు మహాబలేష్, చల్లా దామోదర్‌రెడ్డి, హరీష్‌బాబు, నాగఫణి శాస్త్రి, కోశాధికారి కల్కి మురళి, సభ్యులు గోపీనాథ్, లక్ష్మయ్య, పద్మావతి, స్వప్న, అనురాధ, కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలొస్తే కేసులు నమోదు చేస్తాం

కర్నూలు (న్యూటౌన్): తూకాల్లో తేడాలతో వినియోగదారులను మోసం చేస్తే చట్ట పరంగా కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్ల షాపుల్లో ఆకస్మికంగా దాడుల చేసి నాన్ ఆటోమేటిక్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్లకు సంబంధించిన 35 నాన్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను తనిఖీ చేసి వాటికి సీళ్ల వేశామన్నారు. తూకాలకు ముద్ర లేకపోతే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఏడీ సామ్యేల్ పాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు, సభ్యులు వెంకటరామిరెడ్డి, సురేంద్ర, రవి, బాలచంద్రుడు, రామన్న, హుసేన్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో ఈనెల 22వ తేదీన జరగనున్న రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, మరికొందరు నాయకులు శుక్రవారం బయలు దేరారు. వారికి బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, నాయకులు భగీరథ, ముత్యాల ఈశ్వర్, హరి, జయప్రకాష్, సాయి ప్రణీత్, రాము, సాయిరాం, తదితరులు వీడ్కోలు పలికారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా సాయి ప్రదీప్

కర్నూలు కల్చరల్: బీజే పీ జిల్లా అధికార ప్రతినిధి, జిల్లా హెడ్‌క్వాటర్స్ ఇన్‌చార్జ్‌గా పీటీ సాయి ప్రదీప్ నియమితుల య్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ నియామక పత్రం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పలువురు బీజేపీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

స్పోర్ట్స్

21 న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 21 వ తేదీ స్థానిక రిడ్జ్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు రిడ్జ్ పాఠశాల సీఈఓ గోపీనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పాఠశాల సమావేశ హాలులో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ , ఐకాన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టోర్నమెంటు డైరెక్టర్ రవినాయక్, కన్వీనర్లు శ్రీనివాసులు, నాగేంద్ర, కోచ్ ఇమామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నోడల్ ఆఫీసర్ శివనాగప్రసాద్ బహుమతులు అందజేశారు. కబడ్డీలో శకునాల జట్టుపై గుట్టపాడు జట్టు, క్రికెట్‌లో హుసేనాపురం–1 జట్టుపై, ఓర్వకల్లు జట్టు, వాలీబాల్ పోటీలో గుట్టపాడు జట్టు విజయం సాధించినట్లు నోడల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పరిమిళ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

గడివేముల: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ స్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. కబడ్డీలో గడివేముల జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు, నాగేశ్, పీఈటీ భుజంగరావు పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్ : స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం యోగివేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ వేమన ప్రజాకవి అని, సంఘ సంస్కర్త అని అన్నారు. పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలను చెప్పి ప్రజలను మెప్పించిన తాత్వికవేత్త అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్నకుమార్, వాణిప్రసన్న, విజయశేఖర్, రామకృష్ణ, మల్లికార్జున, కృష్ణమోహన్, ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ ఎండీ అలియా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు కల్చరల్ : 2024 సాధారణ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ లోపు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పని పురోగతికి సంబంధించి ఫొటోలను ఏపీసీకి వాట్సాప్ చేయాలని సూచించారు.

మహాశిల్పం.. చరిత్రాత్మకం

● అతి ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సర్వత్రా హర్షం


కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల ఆశా కిరణం డా.బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహం ప్రారంభం చరిత్రాత్మకమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. దళితులను ఛీదరించుకునే నేతలున్న మన సమాజంలో దళిత, బహుజనుల కోసం ఆహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి నిలువెత్తు రూపాన్ని జాతికి అంకితం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోనుంది. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్ విజయవాడ నగర నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో 18.81 ఎకరాల విస్తీర్ణంలో అతి తక్కువ సమయంలో ఆహ్లాదకర ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఈ మహా ప్రాంగణంలో పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలియజేసి వారి ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందేలా డా.బీఆర్ అంబేడ్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, కుడ్య చిత్రాల గ్యాలరీ, 2 వేల మంది కూర్చునేందుకు వీలుగా కన్వెన్షన్ సెంటర్, 8 వేల చదరపు అడుగుల ఫుడ్‌కోర్టు తదితరావి ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తమవుతుంది.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం



విజయవాడలో అంబేద్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. వైఎస్ జగన్ పాలన ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తూనే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోంది. జగన్ పాలనలోనే ఆయా వర్గాలకు రాజకీయంగా ఊహించని పదవులు దక్కుతున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆయా వర్గాలు నేడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. – సత్తి రాజశేఖర్, డీవీఎంసీ సభ్యులు

పేదలపై ప్రేమకు నిదర్శనం



రాష్ట్రంలో మౌలిక మార్పులే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగుతోంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పాలనలో సముచిత స్థానం కల్పిస్తేనే సాధికారత సాధ్యమవుతుందని భావించి నామినేటెడ్ పోస్టుల్లో ఆయా వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నేడు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వైఎస్ జగన్‌కు ఆ వర్గాలపై ఉన్న ప్రేమకు నిదర్శనం.

– గోన నాగరాజు, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఇంగ్లిషు మీడియంతో గ్రోత్



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడం వల్ల భవిష్యత్తులో ఎకనమిక్ గ్రోత్ కనిపిస్తుంది. ప్రస్తుతం మహా జ్ఞాని అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహా న్ని ప్రారంభించడం అభినందనీయం. సినీ నటుడు నాగార్జున నిర్వహించిన మీలో ఎవరు కోటీశ్వరుడు షోలో బాబా సాహెబ్ ఎవరనే ప్రశ్నకు 27 శాతం మంది మాత్రమే అంబేడ్కర్ అని చెప్పారు. మిగిలిన 73 శాతం మంది ప్రజలకు అంబేడ్కర్ ఎవరనే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలియజేశారు. – కొమ్ముపాలెం శ్రీనివాస్, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

దోమల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్) : పాతబస్తీలో దోమల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎస్‌డీపీ అధ్యక్షుడుష్వాక్ హుస్సేన్ విన్నవించారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థలో మేనేజర్ చిన్నరాముడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, హంద్రీ నదికి అనుకొని ఉన్న 1 వార్డు నుంచి 10 వార్డులతో పాటు బుధవారపేటలో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారన్నారు. దోమలు ప్రబలకుండా మురుగు కాల్వల శుభ్రం చేయడం, పిచికారీ, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు ఎక్కువగా చేయలని విన్నవించారు.

జూనియర్ అసిస్టెంట్ మృతికి నివాళి



పద్మావతమ్మ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పద్మావతమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లు ప్రవీణ్‌కుమార్, హాజీమియ్యాతోపాటు సిబ్బంది నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు డాక్యుమెంట్ రైటర్లు డాక్యుమెంట్ రాయకుండా పద్మావతమ్మ మృతికి నివాళి అర్పించారు.